

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


# కూరగాయల మార్కెట్ పరిశీలించిన ఎమ్మెల్యే

## పార్కు శంకుస్థాపనకు గ్రీన్ సిగ్నల్





**బుచ్చి నవంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం నగరపాలక పంచాయితీలోని కూంగాయాల మార్కెట్‌ను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతో కలిసి పరిశీలించారు. మార్కెట్ అభివృద్ధి పను లను తేజా డవలపర్స్ ద్వారా త్వరలో మార్కెట్‌ను పూర్తి స్థాయిలో అబివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆమె శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం వెనుక వున్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పార్కు నిర్మాణం విషయం పరిశీలించారు. త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అద్యక్షులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మెన్ పుట్టా సుబ్రమణ్యానాయుడు, కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, బత్తల హరికృష్ణా, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, వింజం రామానాయుడు, తాళ్ళ నరసింహస్వామి, కౌన్సిలర్ పఠాన్ నస్రీన్, నెల్లూరు దయాకర్‌రెడ్డి తదితరులున్నారు. అక్కడ వ్యాపారస్తులతో మార్కెట్ పరిస్థితుల గురించి ఆరా తీశారు.

## అదానీ కృష్ణపట్నం పోర్ట్ కు సస్టనెన్స్ ఆర్గనైజేషన్ అవార్డు



**ముత్తుకూరు, నవంబర్ 9, ప్రభాతవార్త** క్వాలిటీ సర్కిల్ ఆఫ్ ఫోరం ఆఫ్ ఇండియా తిరుపతి వారి ఆధ్వర్యంలో శనివారం అదాని కృష్ణపట్నం పోర్టుకు సస్టెన్స్ ఆర్గనైజేషన్ అవార్డును పోర్టు సీఈఓ జగదీష్ పటేల్‌కు తిరుపతిలో అందించారు. నాణ్యమైన కాన్సెప్ట్‌లపై 10వ వార్షిక కన్వెన్షన్ సమావేశంలో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అదాని కృష్ణపట్నం పోర్టుకు ప్రతిష్టాత్మకమైన అవార్డును అందజేసారు. నాణ్యమైన సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు కొనసాగించడం, నిరంతర అభివృద్ధిని కొనసాగించడం, ఎకెపిఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) జగదీష్ పటేల్ నేతృత్వంలోని బృందానికి ఈ అవార్డును అందించారు. హెడ్ మార్కెటింగ్ సిద్దార్థ కుమార్, సారంగి, డిప్యూటీ జనరల్ మేనేజర్ వివేక్ నారాయణన్‌లు అందుకున్నారు. అదాని కృష్ణపట్నం పోర్టు గోల్డెన్ కేటగిరీలో నాలుగు కైజెన్, రెండు క్వాలిటీ కంట్రోల్ అవార్డులను కూడా అందుకుంది. అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కృష్ణపట్నం పోర్ట్ లో భారీ నౌక రికార్డ్ స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి



**ముత్తుకూరు, నవంబర్ 9, ప్రభాతవార్త** అదాని కృష్ణపట్నం పోర్టులో రికార్డ్ స్థాయిలో ఐరన్ ఒర్ దిగుమతి జరుగుతుంది. పోర్టులోని ఐదో నెంబర్ బెర్త్ లో లంగర్ వేసిన నౌక రికార్డు స్థాయి లో జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్‌కు మొత్తం 193,402 ఎంటితో పోర్ట్‌లో అత్యధిక ఐరన్ ఒర్ దిగుమతి చేసేందుకు ఎంవి మినరల్ ఉత్తమరోను నౌకరించి దిగుమతి జరుగుతుంది. కెప్టెన్ ను పోర్ట్ అధికారులు సత్కరించింది. గతంలో 26 ఫిబ్రవరి 2018న జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్ లిమిటెడ్ కోసం 192,856 ఎంటి ఇనుప ఖనిజాన్ని రవాణా చేసిన ఎంవి సమ్‌జాన్ ఆర్గోనాట్ ద్వారా నెలకొల్పబడిన రికార్డును నేడు అధిగమించింది. ఎకెపిఎల్, సిఒఒ, రాజన్ బాబు, మెరైన్ హెడ్, కెప్టెన్ రజత్ గార్గ్, కెప్టెన్ బి సాహూ హోస్ మెరైన్, సెక్యూరిటీ హెడ్, మేజర్ వెంకటేష్ భాస్కర్, పోర్ట్ కంట్రోల్ మెరైన్ ఇన్‌చార్జి జునాద్ షేక్, ఈ అద్భుతమైన సాధనకు గుర్తింపుగా షిప్ మాస్టర్‌కు మెమెంటోను అందించారు.

## కడప దర్గా ఉత్సవాలకు పర్వత రెడ్డికి ఆహ్వానం



**నెల్లూరు రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త** కడప జిల్లా అమీర్ పీర్ దర్గా గంధ మహోత్సవానికి విచ్చేయవలసిందిగా కోరుతూ నెల్లూరులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని దర్గా మత పెద్దలు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా అమీర్ పీర్ దర్గా గంధ మహోత్సవ ప్రాముఖ్యతను ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డికి వారు తెలియ జేశారు. కార్పొరేటర్లు కరీముల్లా, వేలూరు మహేష్ హాజరయ్యారు.

## విదేయతకు పట్టం కట్టిన ముఖ్యమంత్రి

### పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ పదవి



**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రికి నారా చంద్రబాబు నాయుడు పార్టీ పట్ల విదేయ తను చూపుతూ ముందుకు సాగుతున్న వారికి రెండవ సారి ప్రక టించిన నామినేటెడ్ పదవుల్లో విదే యతకు పట్టం కట్టేలా తగు చర్యలు తీసుకున్నారు. 2019 నుంచి 2024 వరకు కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ అప్పట్లో నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్‌ల ఆశీస్సులు తీసుకుని కోవూరు టిక్కెట్‌ను యువతకు ఇవ్వాలని ప్రకటించారు. అప్పటి నుంచి దినేష్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేసి పార్టీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి దంపతులు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి రావడం, ప్రశాంతిరెడ్డి కోవూరు టిక్కెట్‌ను ఆశించడంతో అప్పట్లో చంద్రబాబు సూచనల మేరకు దినేష్‌రెడ్డి ప్రశాంతిరెడ్డికి జై కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఇచ్చిన సూచనల ప్రకారం ఎన్నికల్లో తిరిగి ప్రశాంతిరెడ్డి గెలుపుకు తనవంతుగా కృషి చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ముఖ్యమంత్రి ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ప్రకటించారు. దీంతో కోవూరు నియోజకవర్గంలోని పోలంరెడ్డి వర్గీయుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

## వేమిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించిన మాజీ ఎమ్మెల్యే వంటేరు



**కావలి, నవంబర్ 9 ప్రభాతవార్త** తిరు మల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యు రా లుగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాం త్‌రెడ్డిని, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని విదేశి వ్యవ హా రాల కమిటి సభ్యుడిగా నియమించ డం పట్ల వారిని కావలి మాజీ ఎమ్మెల్యే వం టేరు వేణుగోపాల్‌రెడ్డి ఘనంగా సత్కా రిం చారు. శనివారం నెల్లూరులోని వేమిరెడ్డి దంపతుల నివాసానికి వెళ్లి గజమాలతో వంటేరు సత్కరించారు. పూలబొకెలు అందచేశారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వెండిపూత చిత్రపటమును వేమిరెడ్డి దంపతులకు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వంటేరు కోరారు.

## వైభవంగా పల్లకి సేవ



కోవూరు, కోవూరు, **నవంబర్ 9 ప్రభాతవార్త** కోవూరులోని గాంధీ పార్కు సెం టర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం శ్రవణా నక్షత్ర పర్వది నాన్ని పురస్కరించుకుని కార్తీక కోటి సోమవారం పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాం తా చార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈ ప్రభుత్వంలో వాక్ స్వాతంత్రం కూడా లేదా ప్రశ్నించిన కాకాని



**నెల్లూరు రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త** సోషల్ మీడియా యాక్టివిటీ పై అక్రమ కేసులు దారుణం అని మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు, కూటమి ప్రభుత్వంలో వాక్ స్వాతంత్రం కూడా లేదా..? అని ప్రశ్నించారు. శనివారం డైకస్ రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ, నెల్లూరు నగర ఇంచార్జ్ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివీటి సంజీవయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిపై అక్రమ కేసులు బరాయించడం దారుణం అన్నారు, జరుగుతున్న పరిణామాలపై జిల్లా ఎస్పీకి వివరించబోతున్నామని తెలిపారు. నాపైనే పోలీసులు నాలుగు అక్రమ కేసులు బనాయించారని అలాంటిది సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వైఎస్ఆర్సిపి నేతల నోరు తెరిచినా కూడా కేసులు పెడతామన్న చందంలో పోలీసులు వ్యవహరిస్తున్నారని వైసిపి నేతల్ని పోలీసులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి చివరికి కుటుంబ సభ్యులను కూడా దూషిస్తున్నారని చెప్పారు. అవినీతిని ప్రశ్నిస్తే అక్రమ పేర్లు పెడతారా అని ప్రశ్నించారు. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డిని కించపరిచే విధంగా పోస్టులు పెడుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని అడిగారు. ఆయన కుటుంబ సభ్యులను నీచాతి నీచంగా పోస్టులు పెడుతుంటే అవి పోలీసులకు కనబడటం లేదా ... పోలీసులు కాకి చొక్కా వదిలేసి పచ్చ చొక్కా వేసుకొని డ్యూటీ చేయాలని హితవు పలికారు. ఇప్పటికే వైసీపీ నేతలు ఆవేదనతో ఉన్నారు వారిని రెచ్చగొట్టొద్దు అని హెచ్చరించారు. శాంతిభద్రతలు అదుపు తప్పితే పూర్తి బాధ్యత పోలీసులదేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇబ్బంది పెడుతున్న అధికారులు ఎక్కడున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎక్కడ దాక్కున్న లాక్కొచ్చి శిక్షిస్తామని హెచ్చరించారు. వైసీపీ సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని చెప్పారు. అందరికీ ఒకే న్యాయం ఉండాలని వైసిపి వారిపై అక్రమ అరెస్టులు చేయడం దారుణం అన్నారు. చంద్రబాబు ప్రభుత్వంని చూసి ప్రజలు అసహించుకుంటున్నారు. రాష్ట్రంలో మరో తిరుగుబాటు రాబోతుందని ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని అన్నారు. సూళ్లూరు పేట మాజీ ఎమ్మెల్యే కిలివీటి సంజీవయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు నెరవేర్చడం లేదని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా అని అం టూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు ఎందుకు తీసుకోవట్లేదు అని ఆయన ప్రశ్నించారు. వైసిపి సోషల్ మీడియా వాళ్ళని అన్ని స్టేషన్లు తిప్పి మరి కొడుతున్నారని వీటిని ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా రుద్రహోమం, ఆకుపూజలో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు

**రెండో రోజు ఘనంగా ప్రారంభమైన కార్తీక మాస లక్ష దీపోత్సవం**

**వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన విశేష రుద్రహోమం,**

**ఆంజనేయస్వామికి ఆకుపూజ**





**నెల్లూరు రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని విఆర్‌సి మైదానం వేదికగా నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఉదయం విశేష రుద్రహోమం, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక ఆకుపూజ నిర్వహించారు. ముందుగా మైదానానికి వచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, వేమిరెడ్డి కోటారెడ్డికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికా రు. ఈ సందర్భ ంగా గోపూజ నిర్వహించారు. అనంతరం యాగ శాలలో వేద పండింతుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష రుద్రహోమం నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి వారికి 108 దంపతులచే ప్రధాన అర్చకులు పవన్ శర్మ నేతృత్వంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కోటారెడ్డిల చేతుల మీదుగా ఆకుపూజ చేశారు. కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు భాస్కర్ శర్మ, ప్రభాకర్‌రావు, గంధం సునీల్, విజయసారధి, ప్రముఖులుపాల్గొన్నారు.

# కోటంరెడ్డికి నుడా చైర్మన్‌గా మళ్లీ అవకాశం



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల రెండో జాబితాలో చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకుని శనివారం ఉత్తర్వులు జారిచేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు తొలిసారిగా నెల్లూరుని నుడగా ఏర్పాటు చేసి దానికి ఆనాడు చైర్మన్‌గా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నియమించారు. తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు పార్టీ కార్యక్రమాలకు అంకిత మయ్యారు. తిరిగి 2024 లో టీడీపీ కూటమి అధికారం చేపట్టినప్పటి నుండి పలువురు నాయకులు నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్సీ స్థానాన్ని ఆశించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే అవకాశం ఇవ్వకుండా పార్టీలో సీనియర్ నాయకుడైన ఆయనకి మళ్లీ ఉడా కట్ట పెట్టడం విశేషం. తమ నాయకుడికి మళ్లీ పదవి రావడంపై ఆయన అనుచరులు సంబరాలు స్వీట్లు, బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తనపై నమ్మకం ఉంచి రెండో దఫా నుడా చైర్మన్ గా అవకాశం కల్పించడంతో ఆయనకి కృతజ్ఞతలు తెలియజేశాడు. తనకి పదవి వచ్చేందుకు కృషి చేసిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ది శాఖ మంత్రి నారాయణ చింతరెడ్డిపాలెంలో ఉన్న ఆయన నివాసంలో కలిసి పూలమాల వేసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

# ఉచిత ఇసుక పై ప్రత్యేక శ్రద్ద



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** ఉచిత ఇసుక పాలసీపై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నామని... అందుకే బిల్డర్స్ అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నెల్లూరు నగరంలోని భగత్ సింగ్ కాలనీ, ధీనదయాళ్ నగర్‌లోని ఇసుక రీచ్‌లను ఆయన అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఉచిత ఇసుక విధానం పంపిణీ ఎలా జరుగుతుందోనని అధికారుల్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ఎటువంటి చిన్నపొరపాట్లు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. ఫ్రీ సాండ్‌పై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నామని, దీంతో బిల్డర్స్ అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. దానికి కారణం ఫ్రీ సాండ్ చేయడమేనన్నారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయినా సరే.. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తున్న గనత చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు కూడా లేవని, అవి ఉంటేనే ప్రభుత్వానికి ట్యాక్స్ వస్తాయన్నారు. గత ప్రభుత్వంలో ఇవేమి జరగలేదని విమర్శించారు. సుదీర్ఘ అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు.. ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన సూపర్స్ పథకాల్లో వనబైవన్ చేస్తూ వస్తున్నారన్నారు. ఉచిత ఇసుక పాలసీలో మరో రెండు రూపాయలు తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.900లకే వచ్చే విధంగా అన్ని విధాల ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏదైతే చెప్పిందో నూటికి నూరుపాలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి పెరిగే వరకు ప్రజలందరూ కాస్త ఓపికగా ఉండాలని కోరారు. ఆర్థిక పరిస్థితి పెరిగితే.. ఆటోమేటిక్‌గా రాష్ట్రం బాగుపడడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇతర రాష్ట్రాలకి మన ఇసుక పోయేందుకు లేదని ఇప్పటికే సీఎం చంద్రబాబు ఆదేశించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డితో పాటు నగర అధ్యక్షులు మామిడాల మధు, మాజీ జడ్పీటీసీ ముప్పాళ్ల విజేతరెడ్డి, టీడీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# పూడికతీత పనులు డ్రోన్ కెమెరాతో చిత్రీకరణ



**నెల్లూరు అర్బన్, నవంబర్ 9, ప్రభాతవార్త** ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించవలసిందిగా సంబంధిత అధికారులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ తో కలసి ఇరిగేషన్, విద్యుత్ శాఖలపై మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులకు ఇప్పటికే 50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, రెండు రోజుల్లో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంబిస్తామన్నారు. పనులు ప్రారంభించే ముందే డ్రోన్ కెమెరాతో వీడియో చిత్రీకరణ చేయవలసిందిగాను, అదేవిధంగా పనులు పూర్తయ్యాక మరల డ్రోన్ కెమెరాతో చిత్రీకరించవలసిందిగా సూచించారు. ఈ విధంగా అనవసర ఆరోపణలకు తావు లేకుండా పనిచేస్తామన్నారు. అలాగే తమ ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా పనిచేస్తున్నద నటానికి డ్రోన్స్ కెమెరాలను వినియోగించడమే నిదర్శనమన్నారు. భవిష్యత్తులో అన్ని పనులకు డ్రోన్ కెమెరాలను ఉపయోగిస్తే నాణ్యత పెరుగుతుందని ముఖ్యమంత్రి తరచూ చెబుతారన్నారు.

**మంత్రి నారాయణ మార్కు పనితీరుకు నిదర్శనం....**

**24 గంటల్లోనే సమస్యకు పరిష్కారం**

నిన్నటి ఐఏబి సమావేశంలో రైతులు, రైతు సంఘాల నాయకులు రైతులకు విద్యుత్తు 7 గంటలు మాత్రమే అందిస్తున్నారని, అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ఈ విషయాలను పరిశీలించిన మంత్రి నారాయణ జిల్లా కలెక్ట ర్‌తో కలసి ఇరిగేషన్, విద్యుత్ అధికా రులతో సమావేశమై కూలంకషంగా చర్చించారు. సమస్య పరిష్కారం కోసం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తోను, సెక్రటరీ విజయానంద్ తోను సమావేశం నుండే ఫోన్ ద్వారా విపులీకరించారు. వెనువెంటనే రేపటినుండి రైతులకు 9 గంటల విద్యుత్తుకు, 200 ట్రా న్స్ఫార్మర్లు జిల్లాకి కేటాయించుటకుమంత్రి రవి కుమార్‌ని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ ఇ విజయన్, తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్ ఇ వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


In the Court of the Principal District Judge, Nellore
E.P.No.661/2023
O.S.No.315/2014
1. Potturu Manjula Vani
2. Potturu Venkata Satya Narayana - DHRs
Vs
1. Budati Aruna Kumari
2. Budati Alekya - JDRs
NOTICE TO JDR2
Budati Alekya, D/o Late Anjaneyulu, D.No. 2/363, Gandla Street, Nawabpet, Nellore.
పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్స్ మీ మీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి. లో మీకు నోటీసు నిమిత్తం తేది: 22.11.2024న వాయిదా ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
A.చంద్రశేఖర్ గుప్త B.A., B.L.,
డిక్రీ హోల్డర్ తరపు అడ్వకేటు, నెల్లూరు.
Cell : 94405 04037

## మౌలానా ముష్టాక అహ్మద్‌కి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నియామకం పట్ల మండల నాయకులు హర్షం

**ఉలవపాడు, నవంబర్ 9, ప్రభాతవార్త :** మౌలానా ముష్టాక అహ్మద్‌కి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు ఉలవపాడు మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నారా చంద్రబాబునాయుడుకి మండల నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ధన్యవాదాలు తెలిపిన వారిలో మండల నాయకులు ఆర్ఎంపీ కరీం, అహ్మద్ భాషా, షేక్ బాబు(సారా బాబు), మౌలానా, షాజహాన్, బొడ్డు ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఆధార్ మార్పులకు విద్యార్థుల తిప్పలు

**ఉలవపాడు, నవంబర్ 9, ప్రభాతవార్త :** విద్యార్థులు వారి ఆధార్ కార్డులో గల తప్పులను సరి చేసుకునే నవీనకరణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఆధార్ కార్డులో ఏదీ సరి చేసుకోవాలన్నా పుట్టిన తేదీ, సర్టిఫికేట్ అవసరం ఉందని అది లేకపోతే పని కాదని ఆధార్ కేంద్రాల వారు చెప్పడంతో పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఏమి చేయాలో అర్థం కాక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్షరజ్ఞానం లేక అవగాహన రాహిత్యం గల తల్లిదండ్రులు, పిల్లల పుట్టిన రోజును నమోదు చేయాలనే విషయం తెలియక పట్టించుకోకపోవడంతో ఈ రోజు ఈ సమస్య తలెత్తింది. ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కాక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చాలా ఆందోళన చెందుతున్నారు.

## శనీశ్వరునికి ప్రత్యేక అభిషేకం

**విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** మండలం ముదివర్తి గ్రామం పెన్నా నది తీరాన కొలువైన శని చక్రవర్తికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం అభిషేకాలు,అర్చనలు హోమాలు కాలభైరవునికి వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. జిల్లాలో పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీకదీపం వెలిగించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా ఆలయ సేవకులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## కార్తీకమాసం వేడుకల శోభ



విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త : మండల కేంద్రంలో వెలసియున్న శ్రీ గంగా కామాక్షి దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, పూల అలంకరణ ,విద్యుత్ అలంకరణ చేయడంతో శివాలయం అంగరంగ వైభవంగా భక్తులకు దర్శనం కలిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండుగగా లక్ష దీపోత్సవం



**విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలం ముదివర్తి గ్రామానికి చెందిన భక్తులు పేడూరు సోలామయ్య, వెంకట రమణమ్మ దంపతులు నెల్లూరు నగరంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తిక దీపోత్సవ కార్యక్రమానికి వందల సంఖ్యలో తరలివెళ్లారు. కమనీయంగా భక్తులు భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవని శోభ రెండో రోజు వైభవంగా జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యేకు భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

## విధుల్లో ప్రాణాలు సైతం లెక్కచేయని ఎస్సై అంకమ్మ

- ప్రాణాలు సైతం లెక్కచేయకుండా నీటిలో దూకిన ఎస్సై
- వ్యక్తి ప్రాణాలు కాపాడాలని ఎస్సై





**ఉలవపాడు, నవంబర్ 9, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామంలో కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ఒక వ్యక్తి గ్రామంలో తిరుగుతున్నాడు. రోజు మాదిరిగానే గ్రామంలో కోనేరు వద్ద కూర్చుని ఉండి ఒక్కసారిగా నీటిలో పడిపోయాడు. ఈ సంఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు, స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన ఉలవపాడు ఎస్సై అంకమ్మ వ్యక్తి ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కోనేటి నీటిలో దూకి 15 నిమిషాల పాటు నీటిలో గాలించారు. వ్యక్తి మృతదేమాన్ని బయటకు లాగాడు. ఎస్సై అనుకున్నట్టుగా వ్యక్తి ప్రాణాలు కాపాడలేకపోయానని చాలా విచారం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విధుల్లో ఇలాంటివి లెక్కచేయకూడదని ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడటం ధ్యేయంగా పోలీసులు పని చేస్తారని ఆయన చెప్పడంతో స్థానిక వ్యాపారస్తులు ఎస్సైను ఎంతో అభినందించారు. మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

## వృద్ధ తల్లిదండ్రులపై చిన్న కొడుకు దాడి

**చేజర్ల అక్టోబర్ 9 ప్రభాతవార్త :** చేజర్ల మండలం కొలపనాయుడుపల్లి గ్రామంలోశుక్రవారం రాత్రి ఓ ఆస్తి అంశంపై సాక్షాత్తు తల్లిదండ్రులపైన వారి చిన్న కుమారుడు దాడి చేసిన సంఘట న జరిగింది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొలపనాయుడుపల్లి గ్రామాంలో మాజీ సర్పంచ్ దాది బత్తిన పెంచలరెడ్డి తనకు సంబందించిన భూమిని ఇద్దరు కుమారులకు గతంలో పంచి పెట్టడం జరిగింది. తన వద్ద మరికొంత భూమిని ప్రస్తుతం ఆయన సాకుకుంటున్న కూతురుకుమారుడు (మనవడు) జితేందరెడ్డికి ఎనిమిది ఎకరాల భూమిని పంచిపెట్టాడు. మనవడుకి తల్లిదండ్రులు లేకపోవడంతో పెంచలరెడ్డి ఇంట్లోనే తన వద్ద ఉంచుకొని చాక్కుంటున్నాడు. దీనిపైన ఆగ్రహంచిన చిన్నకుమారుడు వృద్ధ తల్లిదండ్రులపై దాడి చేస్తుండడంతో అడ్డుకున్న వారి పెద్దకుమారుడు మనవళ్ళపైన చిన్నకుమారుడు కేసు నమోదు చేయించాడు. చిన్నకుమారుడు కి భూమిని పెద్ద కుమారుడి కన్నా ఎక్కువగానే పంచినట్లు సమాచారం. తల్లదండ్రులు చిన్న కుమారుడుపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్ళగా అక్కడ పోలీసులు కేసు తీసుకునేందుకు నిరాకరించారు. చిన్నకుమారుడికి తలకు గాయాలు కావడంతో నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ప్రారంభమైన కార్తీక మాస లక్ష దీపోత్సవం



























ఫోటోలు : నంద మాల్యాద్రి

## గర్భవతులకు రక్తపరీక్షలు



**సైదాపురం, నవంబర్ 9, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి మాతృవందన సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 9వ తేదీ నిర్వహించే పరీక్షల్లో భాగంగా సైదాపురంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు నిత్యప్రశాంతి, హర్షిత శనివారం గర్భవతులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌బీ, బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించి గర్భవతులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో హైరిస్క్ గర్భవతులను గుర్తించి వారిని వెంటనే హాస్పిటల్‌కి పంపాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ, పీహెచ్‌ఎన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలుర వసతి గృహాలను సందర్శించిన వైద్యాధికారి



**పొదలకూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. వి. నరసింహారావు ఆధ్వర్యంలో మహమ్మదాపురం గ్రామంలోని బిసి 1,2 ఎస్‌సి బాలుర వసతి గృహాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి ఆహార పదార్థాలను వేడిగా ఉన్నప్పుడు భుజించవలెనని, శుద్ధిచేసిన నీటిని త్రాగవలెనని సూచించారు. అనంతరం విద్యార్థులను పరీక్షించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, నరసమ్మ, హాస్టల్ వార్డన్లు నారాయణ, దేవకుమార్, ఎంఎల్‌హెచ్‌పి వెంకట యమునా, ఆరోగ్య సహాయకులు పెంచలమ్మ, మజహరుద్దీన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకయ్య స్వామికి పూజలు



**విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** విడవలూరు పశు వైద్యశాల ఆవరణం గుడ్లూరు శ్రీనివాసులు నివాసంలో వెలసియున్న వెంకయ్య స్వామికి కార్తీకమాసం సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకం,పూలంగి సేవ కార్యక్రమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, భక్త భజన మండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ వ్యవస్థాపకులు వ్యవహరించారు.

## పోలంరెడ్డి దినేష్ రెడ్డికి శుభాకాంక్షలు



**విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గం టిడిపి నాయకులు పోలంరెడ్డి దినేష్ రెడ్డికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్విరాన్మెంటల్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా విడవలూరు మండల టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

## నవోదయ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**మర్రిపాడు, నవంబర్9ప్రభాతవార్త:** మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ పి.శ్రీనివాసరావ్ తెలిపారు. నవంబర్ 9నుండి 19వ తేదీ లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కొరకు విద్యాలయ హెల్ప్ డెస్క్ నెంబర్ 9963901849,96300429938 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## ప్రజాజీవనం దుర్భరం అందుకే ప్రజాపోరుః సిపిఎం



**జలదంకి, నవంబర్9,ప్రభాతవార్త ః** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలవల్ల సామన్యుడి బ్రతుకు దుర్భరంగ మారింది.ఈకంటక పాలకుల మెడలు వంచేందుకు ప్రజాపోరు జరుపనున్నట్లు సిపిఎంనేత రావిమాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక సురే చెంచురెడ్డి భవన్‌లో శనివారం విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేసి పోరుకు సంబందించిన వివరాలను వెల్లడించారు.ఈనెల 8నుంచి 14వరకు జరుపతలపెట్టినఆందోళనగూర్చి వివరించారు.14న కలెక్టరేట్, తహసిల్‌దార్ కార్యాలయాల ఎదుట దర్నా వంటివి సిపిఎం కేంద్రకమిటి పిలుపుమేరకు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు.పేదలు కటకటలాడుతున్న సమస్యలపై ఆయన ఏకరువుపెట్టారు.ఉచిత ఇసుక తక్షణమే అమలుచేయాలి,పెరిగిననాత్యావసర ధరలను నియం త్రించాలి,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీచేయాలి,నిరుద్యోగబృతిని వెంటనే అమలు చేయాలి,మహిళలుమైనారిటీలు,దళితులపై దాడులు, అత్యాచారాలు తదితరాలపై ఆందోళన చేస్తున్నామని ఆయన తెలిపాడు. కావున ప్రజలందరు ఈపోరులో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈసమావేశంలో నేతలు మేలంగి ఆంతోని,బి నరసింహులు పాల్గొన్నారు.

## బిల్లుల్లేని మొబైల్ ఫోన్‌లను కొనుగోలు చేయవద్దు



**బిట్రగుంట,నవంబర్9,ప్రభాతవార్తః** బోగోలు మండలంలోని ప్రజలు వారి స్నేహితుల వద్దకాని గుర్తుతెలియని వ్యక్తులవద్దకాని సరైన పత్రాలు చార్జరు లేకుండ ఎటువంటి మొబైల్ ఫోన్లు తక్కువ ధరకు వస్తాయని ఆశపడి కొనుగోలు చేయవద్దని బిట్రగుంట ఎస్ఐ బోజ్యా హెచ్చరించారుబిల్లులేని మొబైల్ ఫోన్‌లన్ని కొనుగోలుచేస్తే అది నేరమని దానివల్ల కొనుగోలు చేసినవారు నష్టపోతారని,ఎవరైన విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారమందించాలని ఆయన కోరారు.

## బోగోలులో సిపియం ప్రజాపోరు



**బిట్రగుంట, నవంబర్9, ప్రభాతవార్తః** మండలకేంద్రమైన బోగోలు దళితవాడలో సిపిఎంపార్టీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతి రేక విధానాలపై ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగ మండల సిపిఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రకమిటి సభ్యులు టి మాల్యాద్రి మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విదానాలపై ఈనెల14 మండల తహసిల్‌దార్ కలెక్టరేట్ కార్యాలయాలవద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగ బోగోలు దళితవాడలో ప్రతి ఇంటిని సందర్శించి ప్రజల్ని చైతన్య పరచేందుకు కరపత్రాలు పంపిణీచేసినట్లు పేర్కొన్నారు.ఉపాదిహామీ పదకంకింద అర్హులైన వారికి కూలి పనులు కల్పించాలని,పనిదినాలుపెంచాలని ఆయన డిమాండ్ చేశారు.విద్యుత్,ట్రూఆప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని,స్మాట్ మీటర్లు బిగించే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు.ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని,ఉద్యోగ ఖాళీలు వెంటనే బర్తీచేయాలని,మద్యం విచ్చలవిడి విక్రయాలను నిరోదించాలని,నిత్యావసర ధరలు నియంత్రించాలని పలు డిమాండ్లతో ఈఆందోళన చేపడుతున్నామని తెలిపారు.దీనికి అందరు మద్దతుగ నిలిచి విజయవంతం చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య,పార్టీ నేతలు పిసురేష్,పి సీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్ఆర్‌లో పిహెచ్‌డి గ్రహీతకు సన్మానం



**బిట్రగుంట,నవంబర్9,ప్రభాతవార్తః** బోగోలు మండలం కడనూతల గ్రామంలోని ఆర్‌ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఇసియి విభాగంలో అద్యాప కురాలుగ పనిచేస్తున్న పి బృందావనికి ఇటీవల అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీవారు పిహెచ్‌డి అవార్డు అందజేసిన కారణంగ ఆమెను ఘనంగ సత్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి తెలిపారు.జెయన్‌టియు యూనివర్సిటిలో ప్రొఫెసర్‌గ పనిచేస్తున్నట్లు డి విష్ణువర్దన్ పర్యవేక్షణలో ఆప్టిమైజేషన్ ఆఫ్ పవర్ అండ్ ఏరియ ఎఫిషియంట్ ఈఈజి సిగ్నల్ అక్విజిషన్ సిష్టంమీద అద్యయనంచేయడంతో ఈఅవార్డు బహూకరించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎఓ ఆర్‌వి రమణారెడ్డి,వైస్ ప్రిన్సిపల్ వి సునీల్‌రెడ్డి అన్ని విభాగాల అదిపతులు అద్యాపకులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

## వైభవంగా స్వామివారికి అభిషేక పూజలు



**కోవూరు, నవంబం9 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం కార్తీక కోటి సోమవారం పర్వదినం సందర్భంగా వెంకటేశ్వర స్వామివారి శ్రవణా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు నందకుమార్ స్వామి పర్యవేక్షణలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్ని వెంకటేశ్వర్లు, కార్యదర్శి సింగంశెట్టి రమేష్‌బాబు, కోశాధికారి మెంటా రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు చిన్ని వెంకట సుబ్బయ్యలతో పాటు ఈ పూజా కార్యక్రమం నిర్వాహకులు గట్టుపల్లి శ్రీనివాసరావు దంపతులు , జక్కల ప్రసాద్ దంపతులు, కె. కోటేశ్వరరావు దంపతులు, గునుపాటి సుబ్బారావు దంపతులు, ఐతా చిన వెంకటసుబ్బయ్య దంపతులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్



**కోవూరు, నవంబం9 ప్రభాతవార్త :** కోవూరులోని జెబీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఓటరు నమోదు కేంద్రాన్ని శనివారం కోవూరు తహసీల్దార్ నిర్మలానందబాబా ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డే గా నిర్వహించి నూతన ఓటర్లకు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిపన ప్రతి ఒక్కరూ ప్రస్తుతం ఈ ఓటరు నమోదు కేంద్రంలో తమ ఓట్లను నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, బీఎల్‌వోలు శ్రీనివాసులురెడ్డి, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన చేసుకోవాలి



**కోవూరు, నవంబం9 ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు. కోవూరు మండలం కోవూరు, పాటూరు గ్రామాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాలను శనివారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఆరోగ్య కరమైన విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో సంక్షేమ అధికారులకు అవసరమైన విద్యార్థులకు నీటిని కాచి ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా సంక్షేమ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఏమైనా అనారోగ్యం సంభవిస్తే వెంటనే సమీపంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గానీ తీసుకువచ్చి సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇలియాజ్, సంక్షేమాధికారులు వెంకట్రావు, నాగరాజు, పద్మ, సుప్రజ, జ్యోతిరాణి, లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



**ఇనమడుగు(కోవూరు,) నవంబం9 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలు చేసే సర్వేను పారదర్శకంగా ప్రభుత్వం నిర్దేశించిన సూచనల ప్రకారం సర్వే నిర్వహించాలని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఎన్‌సీడీ , సీడీ 3.0 శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ఈ సర్వే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజూ కనీసం 5 ఇళ్లకు తగ్గకుండా ఈ సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిలో వారికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయా.. దీర్ఘకాలిక వ్యాధులతో ఎవరైనా బాధ పడుతున్నారా.. షుగర్, బీపీ , క్యాన్సర్ వంటి వ్యాధులపై వారికి అవగాహన కల్పించి వారి యొక్క ఎత్తు, బరువు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా షుగర్, బీసీ తదితర వాటికి అవవసరమైన వారికి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇర్ఫాన్, సీహెచ్‌వో ప్రభావతి, పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, ఇలియాజ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామాల్లోని వైద్యాధికారులు ఉన్నారు.

## టిడిపి కార్యకర్తను పరామర్శించిన కావలి ఎంఎల్ఎ



**బిట్రగుంట,నవంబర్9,ప్రభాతవార్తః** బోగోలు మండలం తెల్లగుంట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త సన్నిగంటి వేణు అనారోగ్యంతో బాధపడుతు ఆసుపత్రిలో చికిత్సపొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న కావలి శాసనసభ్యులు దగ్గమాటి వెంకట కృష్ణారెడ్డి ఆయనను పరామర్శించి త్వరిత గతిన కోలుకోవాలని ఆకుటుంబానికి అండగ తాను బరోసాగ వుంటాననిధైర్యం కల్పించారు.ఆయన వెంటమండల టిడిపి కన్వీనర్ ఎం నాగేశ్వరరావు,మాజీ ఎంపిటిసి చితకపాటి వెంకటేశ్వర్లు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## చేతివృత్తి దారుల చేతులిరిచిన పాలకులు




**కోవూరు, నవంబం9 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తుల నుంచి వృత్తిదారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నాయని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకుడు గుంజి దయాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా శనివారం గాంధీ సంఘం, గుమ్మలదిబ్బ, పల్లిపాలెం, పాటూ రులో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ సరళీకరణ విధానాల వలన చేతివృత్తులన్నీ ధ్వంసమై పోతున్నాయన్నారు. కేంద్రం లోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పథకాన్ని రాష్ట్రీయ వికాస్ పథకాన్ని, బెడ్ పాలక్ బీమా యోజన పథకాలను రద్దు చేసిందన్నారు. అదేవిధంగా పలు పథకాలకు నిధులు కేటాయింపుల్లో కోత విధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చేనేత , కల్లుగీత, వడ్డెర, వడ్రంగి వంటి దాదాపు కోటి 70 లక్షల మంది వివిధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి వారికి గత ప్రభుత్వంలో కూడా ఎటువంటి పథకాలను , నిధులను విడుదల చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వృత్తిదారుల కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించి వారి అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. ఈకార్యక్రమంలో నేతలు శేషయ్య, బుజ్జయ్య, ఎస్‌కే బాబు, పెద్దబ్బయ్య, రమేష్, శ్రీనివాసులు, హరి, గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబం9 ప్రభాతవార్త : :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలోకార్తీక కోటి సోమ వారం పర్వదినం సందర్భంగాశనివారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదా యబద్దంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేకపూజలుచేపట్టారు.ఆలయంలో పల్లకిసేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. రుత్వికులు సుబ్బయ్య స్వామి,, ఫణీంద్రస్వామి, ఉన్నారు.

## ట్రూ ఆఫ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలి సిపియం నేతలు



**కావలి, నవంబర్ 09 ప్రభాతవార్త :** అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ట్రూ ఆఫ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని సిపియం నేతలు డిమాండ్ చేశారు. సిపియం రాష్ట్ర పిలుపులో భాగంగా కావలి పట్టణంలోని 18వ వార్డు పొట్టిశ్రీరాములు స్కూల్ తదితర ప్రాంతాల్లో శనివారం ప్రజాపోరును నిర్వహించి కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపియం పార్టీనేతలు పసుపులేటి పెంచలయ్య, వై.కృష్ణమోహన్, జి.మధుసూధన్‌రావులు మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలుచేయకుండా అధికారంలోకి వచ్చిన 5 నెలలకు ట్రూ ఆఫ్ సర్దుబాటు కరెంటు చార్జీలు 6,072 కోట్లు ప్రజలపై భారం మోపుతుందని దుయ్యబట్టారు. ఇప్పుడు కొత్తగా 11వేల కోట్లు విద్యుత్ చార్జీల భారం వేయాలనుకుంటుందని విమర్శించారు. దీనివలన విద్యుత్ చార్జీల భారం వినియోగదారులపై 1 యూనిట్ 1.80 పైసల నుండి 2.40 పైసల వరకు అదనపు భారం పడుతుందన్నారు. ఇది చాలా దుర్మార్గమని దుయ్యబట్టారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లు పెట్టేదిలేదని కరెంటు చార్జీలు పెంచేదిలేదని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన 5 నెలలకే ప్రజలపై మోయలేని కరెంటు చార్జీల భారం మోపుతుందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను పెడుతున్నారని, ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు సతమతమౌతున్నారని తెలిపారు. వెంటనే ట్రూ ఆఫ్ కరెంటు చార్జీలు ప్రభుత్వమే భరించాలన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా ఆపివేయాలన్నారు. ప్రజలపై భారాలు మోపితే ప్రజా ఆందోళనను మరింత ఉధృతంగా కొనసాగిస్తామని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.శీనయ్య, కె.చెన్నయ్య, సిపియం కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



**సీతారామపురం నవంబర్ 9 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఉదయగిరి ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ సిఐ లక్ష్మణస్వామి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతు తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా పోరుమామిళ్ళ కాశయ్య వద్ద 10 మద్యం బాటిళ్ళు పట్టుకున్నామని వారిపైన కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

## దొడ్ల కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

**బుచ్చి నవంబర్ 9 ప్రభాతవార్త :** తెలుగుదేశం నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి తండ్రి గత నాలుగు రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకొని పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి,ఏటూరు శివరామకృష్ణారెడ్డి పలువురు నాయకులు కోదండరామిరెడ్డి,ఆయన సతీమణి మాజీ ఎంపిపి దొడ్ల విజయలక్ష్మిని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గిరిజనులకు భోజనం ప్యాకెట్లు వితరణ



**కావలి, నవంబర్ 09 ప్రభాతవార్త :** కావలి పట్టణం బుడమగుంట గిరిజనులకు శనివారం భోజనం ప్యాకెట్లను వితరణ చేశారు. సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో కలిగిరి వాసులు యన్.ప్రమీలారాణి, ఆమె అత్తయ్య నూతక్కి కామాక్షమ్మ జ్ఞాపకార్థంగా గిరిజనులకు భోజనం ప్యాకెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో దాత యన్.ప్రమీలారాణి, ఆమె కుమార్తె ఉషారాణి, మనవరాలు, మనవడు గౌరిశ్రీ, జీవన్‌సాయి, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు. సురేంద్ర సేవలను దాతలు కొనియాడారు.

## రాజ్యాంగంలో ఉన్న హక్కులను తెలియచేసేదే న్యాయసేవాధికారిక సంస్థ



**కావలిరూరల్, నవంబర్ 09 ప్రభాతవార్త :** రాజ్యాంగంలో ప్రజలకు ఉన్న హక్కులను, బాధ్యతలను ఎల్లవేళలా గుర్తుచేస్తూ వారిని చైతన్యం చేసేదానికి న్యాయసేవాధికారిక సంస్థ పనిచేస్తుందని న్యాయవాది, సామాజిక కార్యకర్త ఐ.సాయిప్రసాద్ శనివారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1987 సంవత్సరం నవంబర్ 9వ తేదీన జాతీయ న్యాయసేవాధికారిక సంస్థ ఏర్పాటుచేయడం జరిగిందని తెలియచేశారు. ఈ సంస్థ పేద, బడుగు, బలహీనవర్గాల వారికి ఎప్పటికప్పుడు ఉచిత న్యాయసహాయం అందించి క్షేత్రస్థాయిలో వారిలో ఉన్న రుగ్మతలు తొలగించి చైతన్యపరుస్తూ సామాజిక న్యాయం అందించేదానికి ప్రభుత్వంతోపాటు ఈ న్యాయసేవాధికారిక సంస్థ సేవలు అందించడం జరుగుతుందని తెలియచేశారు. ఈ సంస్థ ద్వారాప్రజలకు న్యాయంతోపాటు చైతన్యం కలుగుతుందని తెలిపారు.

## ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు జరపాలి



**ఇందుకూరుపేట, నవంబర్ 9, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని టీపీ గూడూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట మండలాలలో 18 మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి మద్యం దుకాణం దగ్గర ధరల పట్టిక అమర్చామని, వాటిని అతిక్రమించి అధిక ధరలకు మద్యం విక్రయాలు జరిపిన గ్రామాల్లో అక్రమ మద్యం అమ్మకాలు జరిపిన, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంగపట్నం రోడ్డు మైపాడులో చింపం తాతయ్య బొమ్ము నరసింహులు దగ్గర 22 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు.

## గుండెవైద్య నిపుణులు రాక నేడే



**వింజమూరు,నవంబర్9ప్రభాతవార్త:** వింజమూరులోని డాక్టర్ మాశిలామణి వైద్యశాలకు ప్రఖ్యాత కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.హెచ్.నాగరాజరావ్ , కిమ్స్ వైద్య నిపుణులు వింజమూరుకు ఆదివారం విచ్చేయనున్నారని డాక్టర్ మాశిలామణి తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలన్నారు. పుట్టుకతో వచ్చే గుండెలోపాలు, గుండె సరిగా కొట్టుకొనకపోవడం, గుండెదడ, ఆయాసం , కొలస్ట్రాల్ సమస్యలు , యాంజియోప్లాస్టి , కవాటాల సమస్యలు, బిపి సమస్యలు , గుండెపొరల్లో నీరు, గుండెకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు డాక్టర్‌ను సంప్రదించి తగిన సూచనలు సలహాలు పొందాలన్నారు. నేడు ఆధునిక జీవన విధానంలో అలవాట్లు, వత్తిడిలు, ఊబకాయం , వ్యాయామం లేకపోవడం తదితర కారణాలతో హృద్రోగుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుందని గతంలో 60ఏళ్ళకు పైబడిన వారిలో వచ్చే గుండెపోటు ప్రస్తుతం యువతతోపాటు పిల్లలకు కూడా వస్తుండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కోవిడ్ అనంతరం గుండెవ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిందన్నారు. వైరస్‌బారిన పడి కోలుకున్న వారు ఏచిన్నపాటి చాతీనొప్పి వచ్చినా వైద్యులను కలిసి వైద్యపరిక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుండెకు రక్తంతోపాటు ఆక్సిజన్, ఇతర పోషకాలను సరఫరా చేసే దమనులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని ఈ దమనుల్లో కొలస్ట్రాల్ చేరడాన్ని డాక్టర్లు కరోనా వచ్చి వెళ్ళిన రోగుల్లో గుర్తించారన్నారు. గుండెకు చేరే రక్తం గడ్డలు కట్టి గుండెపోటుకు దారితీస్తున్నా యన్నారు. ఊపరితిత్తుల అనారోగ్య కారణాల వలన కూడా గుండెకు రక్త సరఫరాలో ఆటంకాలు ఏర్పడి గుండెపోటుకు దారితీస్తుందని ఇలాంటి ప్రమాదాల నుండి దూరంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు వైద్యపరిక్షలను క్రమం తప్పకుండా చేయించుకుంటూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు.

## గుడ్లూరు పీహెచ్‌సీలో గర్భవతులకు వైద్యపరీక్షలు



**గుడ్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త :** గుడ్లూరు పీహెచ్‌సీ నందు జాతీయ ఆరోగ్య పీఎంఎస్‌ఎంఏ(ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్) కార్యక్రమం శనివారం జరిగింది. 25మంది గర్భవతులకు వైద్యాధికారి డాక్టర్ పి.మారుతీరావు పరీక్షలు నిర్వహించారు. రక్తంలో హెచ్‌బీ శాతం తక్కువ ఉన్న వారిని ఇద్దరిని గుర్తించి వారికి ఐరన్, సుక్రోజ్ ఇంజెక్షన్‌లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భకాలంలో పోషకాహార విలువలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, ఆసుపత్రులలో మాత్రమే కాన్పులు జరగాలని, ఇంటి దగ్గర కాన్పులు జరగకూడదని, గర్భవతులకు కాన్పు కోసం 108 వాహనం ఉచితంగా ఉపయోగించుకోవాలని, ఇందుకు వైద్య సిబ్బంది మీకు అన్ని వేళలా అండగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## గంధమహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కావలి, నవంబర్ 9 ప్రభాతవార్త** కావలి పట్టణం జండాచెట్టు సమీపంలోని శ్రీ శ్రీశ్రీ నాగూర్ మీరాస్వాములు వారి గంధ మహోత్సవ కరపత్రాలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ముస్లిం సోదరుల సమక్షంలో కరపత్రాలను విడుదల చేశారు. డిసెంబర్ 11వ తేది గంధమహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుందని ముస్లిం మతపెద్దలు ఎమ్మెల్యేకు తెలిపారు. డిసెంబర్ 2వ తేది చంద్రదర్శనం సందర్భంగా సాయంత్రం గంధమహోత్సవ ఆచారసాంప్రదాయం మేరకు గోమ్ (జె్రి) జెండా ఊరేగింపు జరుగుతుందని ముస్లిం పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు ఎమ్మెల్యేను ఆహ్వానించారు.

## కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన విపిఆర్ దంపతులు



**నెల్లూరు రూరల్,నవంబర్ 9, ప్రభాతవార్త** నూతనంగా నుడా చైర్మన్‌గా ఎంపికైన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం మధ్యాహ్నం నెల్లూరులోని విపిఆర్ నివాసానికి వచ్చిన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను శాలువాతో సత్కరించారు. చైర్మన్‌గా ఎంపిక కావడంపై వేమిరెడ్డి దంపతులు శ్రీనివాసులు రెడ్డిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ అభిరామ సమేత అమరేశ్వర స్వామిని దర్శించుకున్న విపిఆర్ దంపతులు



**నెల్లూరు రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు నగరం లోని పప్పుల వీధిలో పురాతన ఆలయం శ్రీ అభిరామ సమేత అమరేశ్వర స్వామి ఆలయాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆయన సతీమణి టిటిడి బోర్డు మెంబర్, కోవురు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు.

## టిడిపిలో చేరిన వైసిపి నాయకులు



**నెల్లూరు రూరల్, నవంబర్ 9, ప్రభాతవార్త** రూరల్ నియోజ కవర్గంలోని 12వ డివిజన్ చింతా రెడ్డి పాలెంకి చెందిన వైసిపి నాయకులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గిరిధర్ రెడ్డిల సమక్షంలో వారికి తెలుగుదేశం కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. రూరల్‌లో కోటంరెడ్డి బ్రదర్స్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులకు పార్టీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నబాబు, లక్ష్మయ్య, ఏసుదాస్, జనార్ధన్, రూబెన్, నరసింహ, చిరంజీవి, దాన వెంకటేశ్వర్లు, బాబు, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

## కాపు భవన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా



నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం కాపు భవన్లో మౌలిక వసతుల కోసం తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కాపు నేతలకు హామీ ఇచ్చాడు. శనివారం నగరంలోని కాపే నేతలతో కలిసి నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి ఆర్ధిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమర్ధవంతమైన సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు ఆర్ధిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారని వ్యాఖ్యానించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో కాపు భవన్‌కు స్థలాన్ని సేకరించి రూ.50లక్షల నిధులు విడుదల చేయించానన్నారు. అనంతరం తన కుమార్తెలు వారి సొంత డబ్బులు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాపు భవన్‌ను నిర్లక్ష్యం చేసిందన్న ఆయన.. స్థలాన్ని కొందరు కబ్జా చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సర్వే చేసి కాపు భవన్ స్థలాన్ని తిరిగి ఇప్పిస్తామన్నారు. కబ్జా చేసిన వారికి టిడ్కో గృహాల్లో ఇళ్లు ఇస్తామన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నా.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు మంత్రి నారాయణ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలను కూడా నెలకొల్పుతామన్నారు. ప్రారంభ దశలోనే ఆగిపోయిన బీసీ భవన్‌ను కూడా పరిశీలించి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డితో పాటు మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కాపే నేతలు, జనసేన నేతలు పాల్గొన్నారు.

## సేవాతత్పరుడు, అందరివాడు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి



**కావలి, నవంబర్ 9 ప్రభాతవార్త** ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ అండగా ఉండే మంచి రాజకీయనేత మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అని పలువురు కొనియాడారు. శనివారం కావలి ఏరియా వైద్యశాలలో విష్ణు అభిమానులు, అనుయాయులు విష్ణువర్ధన్‌రెడ్డికి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 150 మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గోసాల గోపాల్‌రెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ పాలవల్లి పద్మనాభరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డిలు మాట్లాడారు. రాజకీయాల్లో ప్రత్యేకతలు చాటిచెప్పిన వ్యక్తి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని సేవచేసే మంచి నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎంతోమందికి వైద్యశాలల్లో వైద్యం చేయించిన ఘనత విష్ణన్నకే దక్కిందన్నారు. పాతతరం రాజకీయాలకు ఆయన పెట్టింది పేన్నారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఎల్లవేళలా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు సేవచేసే శక్తి భగవంతుడు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కుందుర్తి కామయ్య, కలవకూరి సుగుణకుమార్‌రెడ్డి,సతీష్‌రెడ్డి, గోపి, రాజేంద్రబాబు,ఉమామహేశ్వరరెడ్డి, తాళ్లపాలెం శ్రీను, పఠాన్ హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు గ్రూపుల్లో మరింత అవగాహన పెంచేలా దృష్టి



**కోవూరు, నవంబర్ 9 ప్రభాతవార్త** : కోవూరు మండలంలోని అన్ని పొదుపు గ్రూపుల్లోని సభ్యుల్లో బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా వాటిని తిరిగి చెల్లించేలా వీవో ఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో శనివారం వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపు సభ్యుల్లో ఇంకా ఎవరైనా నిరక్షరాస్యులు ఉంటే వారిని గుర్తించి అటువంటి వారిని అక్షరాస్యులుగా మార్చే లా వీవోఏలు తగు చొరవ తీసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఎంతసేపటికి పాత వ్యాపారాలే కాకుండా ప్రస్తుతం సమాజంలో వస్తున్న నూతన సాంకేతిక అవసరాలకు అనుగుణంగా కొత్త వ్యాపారాలపై పొదుపు గ్రూపులు దృష్టి పెట్టేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి వీవోఏ వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాము, చైతన్యబాబు, రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా కార్తీక కోటి సోమవారం పూజలు



కోవూరు,**నవంబర్ 9 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారం పర్వదినం సందర్భంగా ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించేందుకు మహిళా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ప్రాత: కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో రుద్రాభిషేక పూజలను సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం వచ్చిన భక్తులకు ప్రసాదవితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, వంశీ స్వామి, సుబ్బారావు స్వామి, శ్రీనివాసరావు స్వామి, తదితరులు ఉన్నారు.

## వైభవంగాలక్ష తులసీ పూజ



కోవూరు, **నవంబర్ 9 ప్రభాతవార్త** కోవూరులోని రైల్వే రోడ్డులో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శనివారం వెంకటేశ్వర స్వామి వారి శ్రవణ నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి లక్ష తులసీ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రధాన అర్చకులు నందకుమార్ స్వామి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మణులు ప్రత్యేకంగా పాల్గొని పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిన్ని వెంకటేశ్వర్లు, కార్యదర్శి సింగంశెట్టి రమేష్‌బాబు, కోశాధికారి మెంటా రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు చిన్ని వెంకట సుబ్బయ్యలతో పాటు ఈ పూజా కార్యక్రమం నిర్వాహకులు గట్టుపల్లి శ్రీనివాసరావు దంపతులు , జక్కల ప్రసాద్ దంపతులు, కె. కోటేశ్వరరావు దంపతులు, గునుపాటి సుబ్బారావు దంపతులు, ఐతా చిన వెంకటసుబ్బయ్య దంపతులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నివాసంలో ఉడా చైర్మన్‌గా నియమితులైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయనని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణానికి ప్రతిఫలం దక్కిందన్నారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు

# ఉన్నది కొండంత చేసేది గోరంత..నిధులు ఉన్న నిరుపయోగం






**విడవలూరు, నవంబర్ 9, ప్రభాతవార్త** పురాతన కాలం నుండి శ్రీ ఆదినారాయణ స్వామి ఆలయం దంపూరు గ్రామంలో నిర్మించబడినది కొన్నేళ్ల క్రితం ఈ ఆలయనికి ఒక గుర్తింపు రావడంతో దేవదాయ శాఖ దేవాలయంగా పేరుపొందినది. అప్పటిలో ఆలయానికి దాతలు 6.70 సెంట్లు భూమిని అభివృద్ధి కోసం కేటాయించడం జరిగింది. ఆ భూమిని దేవదాయ శాఖ అధికారులు కౌలుకి ఇవ్వడం జరుగుతుంది వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి సదుపాయాలకి ఖర్చు చేయాలని నియమాలు ఉన్నాయి. ఆలయ భూమికి వచ్చే కౌలు ఆదాయం ఖర్చు చేయకపోవడంతో దేవాలయం అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మిగిలిపోయింది. స్వామికి పూజలు కొరత ఆదినారాయణ స్వామి పూజలు సక్రమంగా జరగడం లేదని టిడిపి మండల నాయకులు దూది విజయ రాఘవన్ తెలిపారు. ఆలయ నిర్వహణ అధికారి కానీ ఆలయం వైపు చూడకపోవడం పలు అనుమానాలు వెలువెత్తుతున్నాయి. కార్తీక మాసంలో మహిళలు ఆలయంకు చేరుకుని మొక్కులు తీర్చుకొనుటకు ఆరుబయటే పూజలు చేయాలా..? అని ప్రశ్నించారు. పండుగల సమయంలో కూడా పూజలు జరగకపోవడం కార్తీకదీపం వెలిగించే దానికి కరువైనది.ఆలయానికి వచ్చిన ఆదాయం ఏం చేస్తున్నారో దేవదాయ శాఖ అధికారులు తెలియజేయలి లేదంటే స్థానిక ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని హెచ్చరించారు. ఆలయ నిర్వహణ అధికారులు పట్టించు కోవడం లేదు. ఈ ఆలయ భూమికి దేవదాయ శాఖ అధికారులు ఆలయం గురించి పట్టించుకోవడం లేదని ఆలయ భూమిని కౌలుకు చేసే రైతు మామిళ్ళ రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వామివారి భూమికి ప్రతి ఏడాది కౌలు రెండు లక్షల 50 వేలు చెల్లించడం జరుగుతుంది. అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు ఉన్నది కొండంత చేసేది గోరంత ఇదేనా పూజార్లు, నిర్వహణ అధికారి చేసే పనులు దేవదాయ శాఖ నిర్లక్ష్య వైఖరితో ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రత కరువైంది. దీంతో మందు బాబులకు నిలయంగా మారింది. ఇకనైనా దేవదాయ శాఖ ఉన్నత అధికారులు స్పందించి ఆలయంలో జరుగుతున్న అవినీతిని వెలికితీసి భక్తులకు స్వామి సేవలు చేసుకునే భాగ్యం భాగ్యం కల్పించాలని కోరారు.

## సంగంమేశ్వరుని సన్నిధిలో ఉప్పుతో శివలింగం



**సంగం నవంబర్ 9 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని శ్రీకామేక్షిదేవి సమేత సంగమేశ్వరుని సన్నిధిలో కోటి సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున ఉప్పుతో శివలింగాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు పెద్దఎత్తున కార్తీకదీపాలు పెట్టారు. ఉప్పుతో ఏర్పాటు చేసిన శివలింగం చుట్టు మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు.అర్చకులు కార్తీక సోమవారం సందర్భంగా హారతి ఇచ్చారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కాకు మురళీ,మదన్ వ్యవహరించారు.

## నాడీ రుగ్మతకు అధునాతన వైద్యం

### నారాయణలో ఘనంగా సినాప్స్‌న్యూరో క్లినిక్స్ సదస్సు



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** నాడీ సంబంధిత రుగ్మతల నివారణకు ఆధునిక వైద్యం గురించి వైద్యులు తెలుసుకోవాలని న్యూరాలజీ విభాగాధిపతి ఎంఎస్ సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో సినాప్స్ న్యూరో క్లినిక్స్ 2024 రాష్ట్ర స్థాయి సదస్సు జ్యోతి ప్రచురణ అనంతరం సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ న్యూరోకి సంబంధించి తీవ్రమైన తలనొప్పి, పక్షవాతం, బ్రెయిన్ స్ట్రోక్ తదితర జబ్బులకు అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇందుకు సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా ఆవిష్కరించబడిన నూతన వైద్య విధానాలు వివరించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన న్యూరాలజీ వైద్యులు ప్రజెంటేషన్ చర్చ గోష్టిల ద్వారా న్యూరాలజికల్ సేవా నైపుణ్యం పెంపొందించే విధానాలను వివరించారు. ఈ సదస్సు పరిశోధనలపై అవగాహన పెంపొందినందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా నారాయణ వైద్య విద్యాసంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్, నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్‌రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సదస్సులో ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ బి.శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి న్యూరాలజిస్టు, న్యూరోసర్జన్లు, వైద్య విద్యార్థులు సుమారు 300 మందికి పైగా పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఆర్‌జెడ్‌బీ చైర్మన్‌గా సన్నపురెడ్డి



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజినల్ జోన్ బోర్డు చైర్మన్‌గా భారతీయ జనతా పార్టీకి చెందిన జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్న పురెడ్డి సురేష్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వంలో నామి నేటెడ్ పదవులలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇంత బాధ్యతను పెట్టినందుకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని అన్నారు. ఈ నామినేటెడ్ పదవి సురేష్‌రెడ్డిని వరించడంతో నెల్లూరు జిల్లాలో బీజేపీ పార్టీ నాయకులు హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. రామ్మూర్తి నగర్‌లో ఉన్న ఆయన ఇంటి వద్దకి పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరు కుని బాణసంచా పేల్చి, స్వీట్లు తినిపించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలి యజేసి సంబరాలు చేసుకున్నారు.

## శ్రీనివాసులురెడ్డిని సన్మానించిన అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నామినేటెడ్ పదవులో నెల్లూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి చైర్మన్‌గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న మంత్రినారాయణ క్యాంపు కార్యాలయంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ శ్రీనివాసులురెడ్డిని శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

## చిన్నారి పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే



**కలిగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త;** చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తన ఔనత్యాన్ని చాటుకున్నారు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఎమ్మెల్యేపై ప్రశంసలజల్లు కురిపించారు ఆ ప్రాంత ప్రజలు.వివరాల్లోకి వెళ్తే కలిగిరి మండలం ఎరుకు రెడ్డి ప్రాళెంకు చెందిన టిడిపి నాయకులు షేక్ ఖాజామస్తాన్,నూర్జహాన్ కుటుంబం చెన్నైలోబిల్డర్‌గా స్తిరపడ్డారు. వారి కుమార్తెకు ఒక బిడ్డ కలగడంతో ఆకుటుంభం స్వగ్రామమైన ఎరుకుల రెడ్డిపాళెంలో తన మనుమడు(అజ్లాన్)మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా చేయాలని తలంచారు. అదేక్రమంలో తమఅభిమాన నాయ కులైన ఉదయగిరి శాసన సభ్యులు కాకర్లసురేష్, కావలి శాసన సభ్యులు కావ్యాక్రిష్ణారెడ్డిలను ఆహ్వానించారు.ఉదయగిరి శాసన సభ్యులు అందుబాటులేక పోవడంతో మండలంలోని టిడిపినాయకులు, కావలి శాసన సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరైఖాజామస్తాన్ మనుమని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.అంతేగాక ఆచిన్నారిని ఎత్తుకొని నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజల సమక్షంలో దీవెనలు ఇవ్వడంతో అక్కడున్న ప్రజలు ఆనందాలు వ్యక్తపరిచారు. ఒక యంఎల్ఏ స్తాయి నాయకులు ఇలాంటి కార్యక్రమానికి రావడమే కాక చిన్నారిని ఎత్తుకొని ముద్దుపెట్టుకోవడం ఎంత గొప్పవిషయమంటూ కొని యాడారు. అనంతరం ఎంఎల్ఏ చేతులమీదుగా బర్తడే కేక్ కట్‌చేసి పలువురు సంతోషాలను పంచుకున్నారు. చిన్నారి అజ్లాన్ పుట్టినరోజును పురస్కరించుకొనిగ్రామంలో అన్నదాన కార్యక్రమం యంఎల్ఏ చేతులమీదుగా మొక్కలు నాటేకార్యక్రమం జరిపించారు.ఈసందర్భంగా యంఎల్ఏ మాట్లాడుతూ ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలన్నదే తమపార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆకాంక్షయని అదే తామందరం పాటిస్తున్నామన్నారు.టిడిపి నాయకులు ఖాజామస్తాన్‌తనకు ఉన్నంతలో పలువురికి చేరవేయాలని, చంద్రబాబు చెప్పిన విదంగా పచ్చదనాన్ని పెంపొందించడంలో తనవంతు నిర్వర్తించాలనే సంకల్పంతో గ్రామంలో చెట్టునాటేవిదంగా ప్రతిఇంటికి పండ్లమొక్కతోపాటు మొక్కపెంచేందుకు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు.అదేవిదంగా ప్రజలు మంచినీటికి ఇబ్బందిపడుతున్నందున తన సొంత నిదులతో వాటర్ ప్లాంటు ఏర్పాటుకు కూడా శనివారం శంకుస్తాపన చేయడం జరిగిందన్నారు.ఈ ప్లాంటుపనులు త్వరలో పూర్తిచేసి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిచాలనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో దగుమాటిమాల్యాద్రిరెడ్డి, చిట్టాబత్తిన మస్తాన్‌రెడ్డి కలిగిరి మండల టిడిపి అద్యక్షులు బిజ్జంక్రిష్ణారెడ్డి, బొల్లినేని రామారావు,చీమల తాతయ్య,వడ్లమూడి కొండపనాయుడు, గ్రామ సర్పంచి మేకల విజయమ్మ, షేక్ నాయబ్‌రసూల్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో మొక్కలు నాటే కార్యక్రమం



కలిగిరి, నవంబర్ 9, ప్రభాతవార్త; తన మనమడి మొదటి పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా గ్రామంలో మొక్కలునాటే కార్యక్రమం మొదలుపెట్టారుటిడిపి నాయకులు షేక్ కాజా మస్తాన్ దంపతులు. కలిగిరి మండలం ఎరుకుల రెడ్డిపాళెంకు చెందిన టిడిపి నాయకులు షేక్ ఖాజామస్తాన్,నూర్జహాన్ దంపతులు చెన్నైల్లో బిల్డరుగా స్తిర పడ్డారు. తన మనుమడు ప్రదమ పుట్టిన రోజు వేడుకలను స్వగ్రామమైన ఎరుకుల రెడ్డిపాళెంలో చేయడమేకాక గ్రామానికి ఉపయోగపడే పనులు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రయత్నం మొదలు పెట్టారు. మనుమడు(అజ్లామ్)పుట్టినరోజు వేడుకల్లో బాగంగా గ్రామంలోని అంతర్గత రోడ్లు వెంట మొక్కలు నాటేకార్యక్రమం, అదేవిదంగా ఇంటింటికీ పండ్ల మొక్కలుతోపాటు బహుమతులు అందజేశారు. అంతేగాకె గ్రామంలో అన్నదానం ఏర్పాటుచేశారు. తమ అభిమాన నాయకులు ఉదయగిరి యంఎల్ఏ కాకర్ల సురేష్,కావలి యంఎల్ఏ దగుమాటి క్రిష్ణారెడ్డి ఆద్వర్యంలో ఈకార్యక్రమాలు చేయాలని తలంచినా ఉదయగిరి యంఎల్ఏ అందుబాటులో లేకపోవడంతో కావలి యంఎలఏ ఈకార్యక్రమానికి హాజరైనారు.చిన్నారిని ఆశీర్వదించి సేవాకార్యక్రమాల్లో యంఎల్ఏ పాల్గొన్నారు.

## నేడు కావలికి శాప్ చైర్మన్ రవినాయుడు రాక

**కావలి, నవంబర్ 09 ప్రభాతవార్త** శాప్ చైర్మన్ రవినాయుడు ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు కావలికి వస్తారని టిడిపి నేతలు తెలిపారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శాప్ చైర్మన్‌తో కలిసి కావలి పట్టణంలోని మినిస్టేడియాన్ని సందర్శిస్తారు. ప్రజలనుండి పలు సూచనలు స్వీకరిస్తారు.